రహదారి విస్తరణపై రాజకీయం..!

ఆదివాసీల అవస్థలు కాదు.... గిరిజనేతరుల వ్యాపారాలే ముఖ్యం

విశాలాంధ్ర-పాడేరు : రాష్ట్రంలో జిల్లాల విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు మెడికల్ కళాశాల, ఇతరత్రా కార్యాలయాల్లో పనుల నిమిత్తం వేలాదిమంది రోజుకి జిల్లా నలుమూల నుండి వేలాదిమంది పాడేరు పట్టణానికి వస్తూ పోతుంటారు. అలానే వివిధ పర్యాటక కేంద్రాలకు పాడేరు కేంద్ర బిందువు కావడం వలన సందర్శకులు, పర్యాటకులు కూడా సంవత్సరానికి మూడు నాలుగు నెలల పాటు వేలాదిమంది వస్తూ ఉంటారు. ఈ క్రమంలో పాడేరు పట్టణంలో40 అడుగుల రోడ్డు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ సమస్య పెద్ద ఎత్తున పెరిగింది. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ దాటి వర్తకులు తమ వ్యాపార సముదాయాలను రోడ్డు మార్జిన్ వరకు విస్తరించడం, వారి వ్యాపార సముదాయాల ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని మరికొంతమందికి వ్యాపారారీత్యా అద్దెకివ్వడం తో ట్రాఫిక్ సమస్యకు మరో కారణమైంది. వినియోగదారులు ఎక్కడ పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే తమ వాహనాలు నిలుపుదల చేయడంతో మరింత ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీని మూలంగా గతంలో అనేకమార్లు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరాల్సిన అంబులెన్సు సహా చాలామంది వాహనాలు ట్రాఫిక్ లో ఇరుక్కొనిపోయిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని పరిగణంలో తీసుకొని పట్టణంలో ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా గతంలో ఉన్న కలెక్టర్లు రోడ్డుకు ఇరువైపుల అక్రమంగా నిర్మించిన వ్యాపార సముదాయాలను తొలగించడం జరిగింది. కానీ గతంలో ఉన్న రాజకీయ ప్రభుత్వ ఒత్తిడి వలన రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించకుండా పాడేరు పట్టణ అభివృద్ధి ని ట్రాఫిక్ సమస్యని పక్కన పెట్టడం జరిగింది. మరల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకవైపు జాతీయ రహదారి 516ఇ పాడేరు పట్టణం మీదుగా వెళుతున్న సందర్భంలో పాడేరు పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా చెరో 50 ం50 అడుగులతో కూడిన రోడ్డు నిర్మాణా పనులు చేపట్టేందుకు, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య అదిగా మించేందుకు రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, రెవిన్యూ అధికార్లు, ఆర్ అండ్ బి అధికార్లు నోటీసులు జారీచేస్తు 15 రోజుల వ్యవధిలో దుకాణాల ఖాళీ చేయాలని ఆటో ద్వారా ప్రచారం కూడా చేశారు. దీంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కాబోతుందని స్థానిక ప్రజలు ఎన్నో అసలు పెట్టుకొని ఎదురుచూస్తున్నారు. వారి ఆశలు ఆదిలోనే చిరుమేస్తూ, రోడ్డు విస్తరణ అడ్డుకునే దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ గిరిజన ప్రాంతంలో ఏలుతున్న వారు ప్రవర్తిస్తున్నారు. గతంలో వైసీపీ నాయకులు మాదిరిగా ఇప్పుడు మరల రాజకీయ ఒత్తిడి తీసుకొస్తూ ఏకంగా వర్తక సంఘం పెద్దలను అమరావతికి తీసుకొని వెళ్ళి రోడ్డు విస్తరణ అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రజల పక్షాన నిలబడి పాడేరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తుందనీ భావించిన నేపథ్యంలో వర్తక సంఘం నేతలను తోడ్కొని వెళ్తారని తెలిసి అందరూ ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. వర్తక సంఘం పక్షాన నిలబడి పాడేరు పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యను పక్కన పెడుతున్న వారిని తక్షణమే గిరిజన ద్రోహులుగా ముద్రవేయాలని, రాబోయే రోజుల్లో వీళ్ళను ఏజెన్సీలో నిలువ నీడ లేకుండా చేయాలని, ప్రజా సంఘాల, జె ఏ సి నేతలు, గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంత కూటమి ప్రభుత్వ నేతలు గిరిజనుల పక్షాన నిలబడతారో, లేక గిరిజనేతరులైన వ్యాపారుల పక్షాన నిలబడుతారో వేచిచూడాల్సింది.

సిమెంటు రహదారి నిర్మాణాలను సద్వినియోగం చేసుకోండి

జంగం చెట్టు గ్రామంలో సిసి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించిన అంజలి శనివారం సర్పంచ్ రాజబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రహదారిని సద్వినియోగం చేసుకోవాలని అంజలి శనివారం పంచాయతీ సర్పంచ్ పేట్ల రాజబాబు అన్నారు. ఆ పంచాయితీకి చెందిన జంగంచెట్టు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిదులతో నిర్మిస్తున్న 450 మీటర్ల సిమెంట్ రహదారి పనులను ఉపాధి హామీ ఉద్యోగులు, గ్రామస్తులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సరైన రహదారులకు నోచుకోని గిరి గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో సిమెంటు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించుకోవడం శుభ పరిణామం అన్నారు. ఈ రహదారి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు, అదే క్రమంలో రహదారి నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యులు వి మచ్చకొండ, కే గిరి, మాజీ ఎంపీటీసీ పోతురాజు, ఎన్ నూకరాజు, ఉంద్ర మల్లేశ్వరరావు, పి.కామేష్,గ్రామప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధం : ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర-జికే వీధి : మండలంలో డిసెంబర్ ఒకటో తేదీ నుండి వారపు సంతల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తున్నమనీ, అల్లూరి జిల్లా కలెక్టర్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాలతో ఈ ఆంక్షలు విధిస్తున్నమని జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రాజెక్ట్ అధికారి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ వారపు సంతల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ డిసెంబర్ ఒకటో తేదీ నుండి నిషేధిహించబడిందినీ సచివాలయం సిబ్బంది సంతల్లో ప్రచారం నిర్వహించి దుకాణదారులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తు ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని నోటీసులు ఇవ్వడం జరిగింది.. ఇకపై సంతకు వచ్చేవారు జ్యూట్ బాగ్స్ ఉపయోగించాలని శనివారం సపర్ల సంతలో అవగాహన కల్పించుట జరిగిందని ఒక ప్రకటనలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, వీఆర్వో, సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతను సబ్ కలెక్టర్ కల్పశ్రీ పరిశీలన

విశాలాంధ్ర-గంగవరం : మండల కేంద్రమైన గంగవరం లో శనివారం నిర్వహించే వారపు సంతను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా అనుకోని ఉన్న అన్ని వారం వారం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే షాపులను వచ్చే వారం నుండి సంత మార్కెట్ లోపల ఏర్పాటు చేసిన షెడ్డుల యందు షాపులను మార్చావలసినదిగా తహసీల్దార్, ఎంపీడీవో, సచివాలయం సిబ్బందికి సూచించారు. అలాగే వారపు సంతలో అమ్మే అన్ని రకాల వస్తువులు, తినుబంధరాలు అన్ని కూడా సరైన క్వాలిటీ ఉన్నది, లేనిది తనిఖీ చేయవలసినదిగా సచివాలయం సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ప్రకాష్, గ్రామ రెవిన్యూ అధికారి రవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల గురువులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన గురుకుల ఉపాధ్యాయులు పాడేరు ఐ.టీ.డి.ఏ ఎదురుగా చేస్తున్న న్యాయమైన పోరాటానికి దండకారణ్య ఉద్యోగ సమితి, దండకారణ్య విమోచన సమితి, దండకారణ్య విద్యార్థి సమితి నాయకులు సంఘీబావం ప్రకటించాయి. ఈ సందర్భంగా దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. మాణిక్యం మాట్లాడుతూ జాతీయ సంపదలో 80 శాతం ఆదివాసి ప్రాంతానిదేనని, నిరుపేదల జాబితాలో కూడా 80 శాతం గిరిజనులే ఉండటం బాధాకరమన్నారు. గిరిజన గురుకుల పాఠశాల కళాశాలల్లో పని చేస్తున్న గురువులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వలేరా అని ప్రశ్నించారు. మంచి సమాజాన్ని నిర్మించాలంటే గురువులది ప్రధాన పాత్రని అలాంటి గురువులకు రోజు వారి కూలీలకు ఇచ్చే జీతం కంటే దయనీయంగా రూ.9000/-, 10,000/- రూపాయలు నెలసరి జీతమిచ్చి పాలక యంత్రాంగం శ్రమ దోపిడికి పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడలేని విదంగా అవుట్ సోర్సింగ్ విధానంతో రకరకాల పేర్లతో గిరిజన గురుకులాలను నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అధికారంలో ఉంటే ఒకలాగా, ప్రతిపక్షంలో ఉంటే మరోలా ఒకరి తర్వాత ఒకరు పోటీపడుతూ గురుకుల గురువులను అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇకనైనా క్రొత్త ప్రభుత్వం గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అధ్యాపక, ఉపాధ్యాయ మనోభావాలను గౌరవించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షులు కోడా ఆనందరావు, ముఖ్య కార్యదర్శి ధనుంజయ్, కార్యదర్సులు, రాజాబాబు, సమన్వయ కర్తలు మోహిని, ఆనందకుమారి, ప్రభాకర్ దండకారణ్య విమోచన సమితి నాయకులు కవడం కాసులమ్మ, వెంకాయమ్మ, దండకారణ్య విద్యార్థి సమితి నాయకులు ప్రసాద్, నందిని తదితరులు హాజరయ్యారు.

రవ్వలగూడ ఆశ్రమ పాఠశాలను డిడి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - అరకులోయ : మండలంలోని రవ్వలగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి సంచాలకులు ఎల్ రజిని శుక్రవారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల స్టడీ అవర్ ను పరిశీలించారు. స్టడీ హావర్ లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని ఆమె అన్నారు. విద్యార్థులకు అందించిన మెనూపై ఆరా తీశారు. ముందుగా నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మెనూను అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు.

గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం : ఎస్సై పాపినాయుడు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: గ్రామాల్లో గంజాయిని నిర్మూలించి గంజాయి రహిత గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో ముందుకెళ్లాలని స్థానిక ఎస్సై కెల్లా పాపి నాయుడు మండలంలోగల సర్పంచ్లు ఎంపీటీసీలకు సూచిం చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో 18 సర్పంచులు,14 ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గిరిజన యువత గంజాయి సాగు, రవాణాతో జీవితాలు నాశనం అవుతున్నా యని చెప్పారు. అమాయక గిరిజనులను ఆసరగా చేసుకుని ప్రైవేటు వ్యక్తులు గంజాయి సాగు, రవాణా చేస్తూ అస్తులు కూడబెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగణంగా గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయం చేసుకుని సాగు, రవాణాతో కలిగే అనార్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించా లన్నారు. యువత ఉన్నత చదువులకు తోడ్పాటునిచ్చి వారిని ప్రోత్సాహన్నివ్వాలని ఆయన కోరారు.

చిలకలగెడ్డ సచివాలయాన్ని ఎంపీపీ, ఎంపిడిఓ తనిఖీ

విశాలాంధ్ర-అనంతగిరి : మండల పరిధిలో గల చిలకల గెడ్డ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం నాడు మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి నేలవేణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ హాజరు పట్టి మూమెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ఉదయం 11 గంటలైనా కార్యదర్శి రాకపోవడం కాసింత అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది కి తగు సూచనలు చేశారు. సచివాలయం నుంచి బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది ద్వారా చేపడుతున్న ఎన్పీసీఐ మొబైల్ ఆధార్ బ్యాంక్ అకౌంట్ లింక్ కి సంబంధించి ప్రతి లబ్ధిదారుడు చేసుకోవాలని క్షుణ్ణంగా చెప్పాలని తెలిపారు. ఇలా చేయని యెడల ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 25 లోపు 100% పూర్తి చేయలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఎన్పీసీఐ మరియు హౌస్ హెహెల్డ్ జియో టాకింగ్ సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాశిపట్నం సచివాలయం వద్ద జరుగుతున్న స్పెషల్ ఆధార క్యాంపు జరుగుతుందని ఆధార్ ఎన్రోల్మెంట్, వంటివి ప్రతి ఒక్కరూ ఆధార్ అప్ డేట్ చేసుకోవాలని తెలిపారు. మళ్లీ కొత్త ఆధార్ కార్డు ఎవరికైనా కావలసిన వచ్చిన తప్పక నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు ఎక్కువ అయినందున ప్రమాదాలు జరుగుతున్నందున అవి పంచాయతీ పరిధిలో ఆయా కార్యదర్శులు తొలగించే ఏర్పాటు చేశారని ఎంపీడీవో తెలిపారు.

గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ అడవి తల్లి ముఖద్వారం వద్ద గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు గత కొద్దిరోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు శనివారం వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు అండగా మద్దతుగా ఉంటామని తెలిపారు. గురుకులాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారికి పర్మినెంట్ చేయాలి లేదా సిఆర్టి ఉద్యోగులుగా పరిగణించాలని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 2022 పి ఆర్ సి ప్రకారం జీతాలను చెల్లించాలని, 2024 డీఎస్సీలో రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ గురుకులం ఉద్యోగాలు పోస్టులను మినహాయింపు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహోపాధ్యాయ సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం పాల్గొని మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించి వారికి న్యాయం చేయాలని తెలిపారు. ఔట్సోర్సింగ్ గురుకుల ఉద్యోగాల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని వీటన్నిటిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వారికి న్యాయం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కో కన్వీనర్ కే. ప్రమోద్ కుమార్, రాజారావు, ఆనందరావు, జగన్నాయకులు, జయప్రకాష్, జమ్మరాజు, కృష్ణ కుమార్, గురుకుల ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక

విశాలాంధ్ర-సాలూరు : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక సిబ్బందిని ఆదేశించారు. సాలూరు మండలం శివరాంపురంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో అనుసరిస్తున్న చర్యలు, నాణ్యత ప్రమాణాల తీరును పరిశీలించారు. అనంతరం ట్రాక్ షీట్, రికార్డులను గమనించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరను చెల్లించాలని చెప్పారు. రైతులు నచ్చిన చోట విక్రయించు కోవచ్చని, ఇందులో మిల్లర్లు అభ్యంతరం చేసిన, ఒత్తిళ్లకు గురిచేసిన చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఏఓ అనూరాధ పండా,తెదేపా నాయకులు కరిబుగత భాస్కరరావు, దామోదర కృష్ణ, పీపీసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళారి చేతిలో ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలోని రైతులు పండించిన ధాన్యము దళారులకు తప్పనిసరిగా అమ్మవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యము కొనుగోలు కేంద్రంల ప్రారంభించకపోవుటం వల్ల ఈపరిస్థితి ఏర్పడిందని తెలిపారు ధాన్యము సీజన్ ప్రారంభమైన ధాన్యము కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. జిల్లా అధికారులు ప్రకటనలు తప్ప రైతుకు ఎటువంటి భరోసా లేదన్నారు. ప్రతిరోజు లారీలకు లారీలు పక్క రాష్ట్రములకు దాటుతుంటే ప్రభుత్వము పట్టించుకోలేదన్నారు. దళారులతో కుమ్మక్కై రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. మండలంలో 24 రైస్ మిల్లులు ఉన్న,ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ధాన్యం కూడా తరలి వెళ్ళిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారి అంతగా స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రాల ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది.

వినియోగదారులను మోసగిస్తున్న ఈశ్వర హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ

విశాలాంధ్ర-బలిజిపేట : మండలములో పలగర గ్రామంలో ఈశ్వర హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులను మోసగిస్తున్నట్లు వినియోగదారులలో ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీ పరిధి నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఉచితముగా గ్యాస్ బండలను పంపిణీ చేయవలసి ఉండగా,ఈపరిధిలో ఉన్న గ్రామాలు పలగర,చిలకలపల్లి బలిజిపేట, తుమరాడ, వెంగాపురం పెదపింకి గ్రామాలకు గ్యాస్ బండ వాస్తవం రేటు కన్నా ఒక్క బండపై 30 నుండి 50 రూపాయలు వరకు అదనంగా చార్జీలు రూపంలో వసూలు చేస్తున్నారు మరియు వినియోగదారుడు ఇచ్చిన డబ్బుకు రసీదు ఇవ్వటం లేదని తెలిపారు ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి పరిధిలో ఉన్న గ్రామాలకు చార్జీలు లేకుండా డోర్ డెలివరీ చేయాలని ఇచ్చిన డబ్బులకు రసీదు ఇప్పించినట్లు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రభుత్వం విప్ గా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా గుమ్మలక్ష్మీపురం మండలం తన స్వగృహము నకు విచ్చేసిన సందర్భంగా కూటమి నాయకులైన జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి, సాలువాతో సన్మానించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని పెదభోగిలిలో రైతు సేవాకేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరనాయుడు ఏఒఎస్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో కూడా గ్రీవెన్స్‌కు స్వీకారం

విశాలాంధ్ర-సీతానగరం : జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ఆదేశాలు మేరకు మండల కేంద్రంలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా గ్రీవెన్స్ ప్రతీ సోమవారం తీసుకోవడం జరుగుతుందని ఎంపిడిఓ పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. దీన్ని మండల ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సోమవారం ఉదయం 10గంటల నుండి 2గంటలు వరకు ఎంపిడిఓ కార్యాలయంలోలేదా తహశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ అందజేయాలని కోరారు.

ప్రేమ మూర్తి, సేవా స్ఫూర్తి సత్యసాయి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రేమ మూర్తిగా, సేవా స్ఫూర్తిగా భక్తుల మదిలో శ్రీ సత్యసాయి కొలువై ఉంటారని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల కంచరవీధిలో శ్రీ సత్యసాయి 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్య దీప్తిగా సత్య సాయి కీర్తించబడ్డారని తెలిపారు. ఆయన సూచించిన మార్గం, ప్రేమ, సేవా అందరికీ అనుసరనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిపివలస-గదబవలస బిటి రోడ్డు నిర్మాణం పూర్తి

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మరిపివలస గ్రామస్తులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా ఎంఎల్ఏ బోనెల విజయ్‌చంద్ర పెద్ద ఎత్తున బిటి రోడ్లకు శంకుస్థాపనలు చేయగా ఆరోడ్ల నిర్మాణం నేడు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అంటిపేట-వెన్నెలబుచ్చంపేట రోడ్డు పూర్తికాగా, శనివారంనాడు మరిపివలస-గదబవలస బిటి రోడ్డును కూడా గుత్తేదారు పూర్తిచేశారు. ఈరోడ్డు వేయడంతో మరిపివలస గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరమని టిడిపి నాయకులు కె ఎస్ ఆర్, సత్యనారాయణలు, సురేష్, శ్రీను, యోగేశ్వరరావు,గుప్తా తదితరులు తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైనప్పటికీ అప్పట్లో నిధులు లేక ఈప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆదేశాలతో రోడ్డు వేయడంతో రైతులకు ఎంత ఉపయోగకరంగా ఉంటుందని రెండు గ్రామాలనాయకులు, ప్రజలు తెలిపారు. వారంతా ఎమ్మెల్యే విజయ్ చంద్రకు గుత్తేదారుకు కృతజ్ఞతలు తెలిపారు.

తూరుమామిడి పంచాయతీలో ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో తురుమామిడి గ్రామంలో ఆడ లేగ దూడల ప్రదర్శన, ఉచిత పశు వైద్య శిబిరం జిల్లా పశుగణనాభివృద్ధి శాఖ అద్వర్యంలో తురుమామిడి గ్రామంలో సర్పంచ్ కృష్ణంనాయుడు అధ్యక్షతన ఆడ దూడల ప్రదర్శన, ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 40 లేగ దూడల ప్రదర్శనలో పాల్గొన్నాయి. పాల్గొన్న రైతులకి సర్పంచ్, సాలూరు ఆ.డి పశుసంవర్ధకశాఖ పి.సన్యాసినాయుడు, మక్కువ మండల పశువైద్యాధికారి డా.కె.పోలందొర, డిఎల్‌డి.ఏ పశువైద్యాదికారి డా.జగదీష్ చేతులమీదుగ బహుమతులు అందజేయడం జరిగింది. ఏ డీ పశుసంవర్ధక శాఖ మాట్లాడుతూ ఆడ దూడల నిర్వహణ, కేవలం ఆడ ధూడలు పుట్టె లింగనిర్ధారిత వీర్యం, ఉపాధి హామీ పదకం క్రింద 100% సబ్సిడీ పథకం బహువార్షిక పశుగ్రాసాల సాగు గురుంచి రైతులకు వివరించారు. దూడలకు నులిపురుగుల మందులు, కాల్షియం టానిక్స్ అందజేసి పాడిరైతులుకు పాడిపోషణ పట్ల వున్నా సందేహాలను పరిస్కరించారు అలాగే 82 పశువులకు గర్భకోస పరీక్షలుచేసి చికిత్స చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డా.సురేష్‌కుమార్, డా.కె.ప్రభాకర్రావు,పశువైద్యసిబ్బంది, మరియు పాడిరైతులు పాల్గొన్నారు.

మెడకు ఉరి తాడు వేసుకుని నిరసన

తెలివైనవారిని తొలగించే కుట్ర వద్దు : ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

విశాలాంధ్ర-బెలగాం : అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన దీక్షలు నాలుగో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్దకు పలువురు నాయకులు వచ్చి మద్దతు ప్రకటించారు. నాలుగో రోజు మెడకు ఉరి తాళ్లు వేసుకొని నిరసన తెలుపుతూ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు చాలా తెలివైన వారని చెబుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వారిని తొలగించకుండా వారి పోస్టులు డిఎస్సీ నుండి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలక్రిష్ణారావు డిమాండ్ చేశారు. ఇన్నాళ్ళు వెట్టిచాకిరీ చేయించారని ఇకనైనా కనీస వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సమరశీల పోరాటంతోనే సమస్యలు పరిస్కారమవుతాయని అటువంటి పోరాటానికి సిద్ధం కావాలని తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

విశాలాంధ్ర-వీరఘట్టం : మండల ప్రజా పరిషత్ వీరఘట్టం నందు జీఎస్డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి శ్రీ బి. రామ గోపాల్ వారు పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను పాటించడము, హౌస్ హెహెల్డ్ జియో టాగింగ్, లబ్ధిదారుల ఖాతాలకు%చీూజ×% లింక్ పూర్తి చేయించడం, మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల గూర్చి సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో పలు సమస్యలపై వైసీపీ నాయకుల చర్చ

విశాలాంధ్ర-జీకే వీధి : పాడేరు శాసనసభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజును గూడెం కొత్త వీధి మండల వైసీపీ ప్రజా ప్రతినిధులు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని లకవరపుపేట సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ మొట్టడం సత్యనారాయణ, వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్, వైసిపి నాయకులు నరేష్, సిరిబాల రామారావు మరియు చింతపల్లి మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను గురించి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటామని అన్నారు.

ఈనెల 27న బాల వివాహ ముక్త్ భారత్‌కు శ్రీకారం

విశాలాంధ్ర-పార్వతీపురం : బాల వివాహముక్త్ భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టుట జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నవంబర్ 27న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రి ప్రారంభిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించుటకు అవగాహన కల్పించేందుకు బాల వివాహ ముక్త్ భారత్ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన వివరించారు. “యావత్తు ప్రభుత్వం”, “యావత్తు సమాజం” విధానంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతుందని అన్నారు. బాల్య వివాహాలు జరగరాదని ప్రభుత్వ ధ్యేయమని, బాల్య వివాహాలు మానవ హక్కుల ఉల్లంఘనలో అత్యంత దారుణమైన రూపాలలో ఒకటిగా ప్రభుత్వం భావిస్తోందని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నిర్దేశించిన ‘విక్షిత్ భారత్’ లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాన ఆటంకంగా ఉందనే భావన ఉందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ‘ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహాల నిషేధ నియమాలు, 2023 మేరకు జిల్లా, డివిజనల్, ప్రాజెక్ట్ స్థాయిలో బాల్య వివాహాల నిషేధ అధికారులను నియమిస్తూ నోటిఫై చేసిన మేరకు మండల, గ్రామ, మునిసిపల్ స్థాయిలలోను నియమించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కలెక్టర్ జిల్లా బాల్య వివాహాల నివారణ అధికారిగా వ్యవహరిస్తారని, డివిజనల్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ /సబ్-కలెక్టర్, ప్రాజెక్ట్ స్థాయిలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మున్సిపాలిటీలు, మునిసిపల్ కమీషనర్లకు, మండల స్థాయిలో తహశీల్దార్లు, పాఠశాల విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారులు, పంచాయితీ రాజ్ శాఖ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు బాల్య వివాహాల నివారణ అధికారిగా వ్యవహరిస్తారని ఆయన చెప్పారు. జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2015 నిబంధనల ప్రకారం నియమించిన చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ ఆఫీసర్ వారి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికార పరిధిలో బాల్య వివాహాల నివారణ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు. అర్బన్‌లో మున్సిపల్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సంబంధిత గ్రామం / వార్డు సచివాలయం మహిళా రక్షణ కార్యదర్శి / మహిళా పోలీస్ తమ పరిధిలో చర్యలు తీసుకుంటారని చెప్పారు. చట్టం మరియు నియమాల అమలును జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారులు నోడల్ అధికారులుగా ఉంటారని ఆయన చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ/వార్డు బాల్య వివాహ నిషేధం మరియు పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్/కౌన్సిలర్/ కార్పొరేటర్, స్థానిక స్కూల్ హెడ్ మాస్టర్/టీచర్, స్వయం సహాయక బృందం/గ్రామ సమాఖ్య సభ్యులు, పంచాయతీ మహిళా సభ్యులు, గ్రామం/వార్డు సచివాలయం ఎఎన్ఎం, బాలల హక్కులపై ఆయా ప్రాంతంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, యూత్ ఆర్గనైజేషన్ నుండి సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా రక్షణ కార్యదర్శి/ మహిళా పోలీస్ తదితరులు సభ్యులుగా ఉంటారని ఆయన అన్నారు. బాల్య వివాహాల నిరోధానికి అనుసరించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్, వ్యూహం ప్రభుత్వం రూపొందించిందని ఆయన వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, హెల్పర్లు, ఏ ఎన్ ఎం, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, పోలీసు అధికారులు, బాల్య వివాహాల నిషేధ అధికారులు, స్థానిక సంఘం నాయకులు, స్థానికంగా ప్రభావవంతమైన విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన కోరారు . అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల నుండి ఎన్నికైన ప్రతినిధులు, సామాజిక, పౌర సంస్థలు బార్ కౌన్సిల్‌లు/లీగల్ సర్వీసెస్ అథారిటీలలో సభ్యులుగా ఉన్న స్థానిక న్యాయవాదులు మరియు ఎన్ జి ఓ లు లేదా పౌర సమాజ సంస్థలు ప్రచారాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, యుక్తవయస్సులో ఉన్న బాలికలు, బాలికలు, మతపరమైన సంస్థల అధిపతులు, స్వచ్ఛంద సంస్థ సహచరులు, బాల్య వివాహాల నిరోధక అధికారులందరూ బాల్య వివాహాలకు మద్దతు ఇచ్చుటకు ప్రతిజ్ఞలో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు.

ఘనంగా శ్రీసత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని శ్రీసత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలను మరిపివలస, పలుగ్రామాల్లో శనివారంనాడు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ బాబా నామస్మరణ, గీతాలు ఆలపిస్తూ, నగర సంకీర్తన కార్యక్రమాన్ని, ఊరేగింపును కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోఉన్న శ్రీసత్య సాయిబాబాఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను,భజనలను నిర్వహించామని సేవా సమితి కన్వీనర్ బొంగువరలక్ష్మి చిట్టిరాజులు తెలిపారు. సత్యసాయిబాబా తెలియజేసిన ప్రేమించు, సేవ ఆప్యాయతలను గూర్చి వివరించారు. పెద్దఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్చకులు దేవళ్ల సురేష్ తో పాటు గ్రామంలో ఉన్న సత్య సాయి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలో శ్రీ సత్య సాయి బాబా 99వ జయంతి వేడుకలు సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈరోజు ఉదయం 5 గంటల నుండి సుప్రభాత సేవ తో ప్రారంభించి, అమృత కలశాలతో సీతంపేట తిరువీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి ఆలయం ప్రాంగణంలో జండా ఆవిష్కరణ సుబ్బారావు మాస్టర్ ఆధ్వర్యంలో జరిపారు, పేదవారికి దుస్తులు బియ్యం పంపిణీ జరిపారు, మధ్యాహ్నం నారాయణ సేవ ద్వారా అన్నదాన కార్యక్రమంలో సుమారు 3000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవాదళ్ కమిటీ సభ్యులు జి నరసింహులు, ఫకీర్ నాయుడు, డి శ్రీరాములు, ఘంట రామకృష్ణ, నార భీమారావు, కే సుబ్బారావు, ఐ త్రినాధరావు, ప్రసాద్, అడపాక రమణ, జనార్ధన, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ప్రేమ మయిగా సేవా స్ఫూర్తిగా భక్తులు కొలిచే సత్య సాయి భక్తుల మదిలో కొలువై ఉంటారని అయన చూపించిన మార్గం ప్రేమ, సేవ ప్రతీ ఒక్కరికి అనుసరనీయమని మండలంలో గల పెదబుడ్డిడి సత్య సాయి సేవా సమితి కన్వీనర్ రేవల్ల శ్రీనివాసరావు అన్నారు. సత్య సాయి 99వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగాఅన్న సమారాధన చేసి గ్రామ సత్యసాయి కమిటీ సభ్యులు సీమల శ్రీనివాసరావు, కర్రి గోవిందరావు, దేవుపల్లి శ్రీరామమూర్తి, మజ్జి గౌరునాయుడు, బలిమి కవిత, మీసాల గోవిందమ్మ, బలిమి శాంతరామ్, పడాల సింహాచలం సేవాభావం చాటుకున్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక అభివృద్ధి

విశాలాంధ్ర-సీతంపేట : మండలం ధారపాడు గ్రామపంచాయతీ పరిధిలోని బూర్జగూడలో నివాసం ఉంటున్న రైతు జీలకర్ర మధుసూదన్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మునగ మొక్కలను పెంచే పనిని ప్రభుత్వ ఆమోదంతో మొదలుపెట్టారు. ఉపాధి ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందని తెలిపారు. ఎంతో శ్రమతో, ఇష్టంతో సుమారు 4000 మొక్కలు ఆరు నెలల కాలంలో విత్తనం నుంచి మొక్కలుగా మనకి అందించినందుకుగాను రైతుని అభినందన పూర్వకంగా సన్మానించడం జరిగింది. ఎంతోమంది రైతులు ఇలాంటి పథకాలు ద్వారా మరింత లబ్ధి పొందాలని ఆశిస్తున్నాము. ఇక్కడ పెంచిన మునగ మొక్కలను సీతంపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మరియు అంగన్వాడీలకు ఉచితంగా ఇవ్వబడును. మునగ ఆకును ఆహారంలో ప్రతిరోజు పిల్లలకు అందేటట్టు చేయడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చును. మునగ మొక్కలను పెంచుకొని ఆరోగ్యంగా ఉండటానికి ఇష్టపడే ప్రతి ఒక్కరూ సంఘాల ద్వారా ఈ మొక్కలను తీసుకొని వెళ్ళవచ్చును. ఈ కార్యక్రమంలో సీతంపేట మండలం విద్యాశాఖ అధికారులు ఆనంద్‌రావు, సూర్యచంద్ర, ఎంపీడీవో గీతాంజలి, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ రంగ లక్ష్మి, ఎన్ ఆర్ ఈజీఎస్ ఏపీవో సాగర్, దారపాడు సర్పంచ్ సుందరమ్మ, అంగన్వాడి సిబ్బంది, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి
- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : 108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లి అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు పార్వతీపురం బెలగాం చర్చ చర్చి సెంటర్లో గల గిరిజన సామాజిక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బారావమ్మ, ఎపి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ తదితర వక్తలు మాట్లాడుతూ 2005వ సంవత్సరం నుండి ప్రజలకు సేవలు అందిస్తున్న 108 వ్యవస్థ నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వలన అంబులెన్స్ సేవల్లో నాణ్యత కొరవడిందని, కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, అంబులెన్సులు అత్యవసర పరిస్థితులలో సకాలంలో చేరుకోక అత్యవసర వైద్య సేవలు అందక అనేకమంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించాల్సిన 108 వ్యవస్థలో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి తమ లాభాలను పెంచుకునేందుకు ఈ అంబులెన్స్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. 108 వ్యవస్థలో పనిచేస్తున్న 3,500 మంది సిబ్బందికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు పరిహారం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 108 వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే అనేక దఫాలుగా గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం 108 ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, జనసేన పార్టీ నాయకులు జి. శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి. సంగం, సిఐటియు జిల్లా కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రమేష్, 104 ఉద్యోగ సంఘం నాయకులు జి. దుర్గారావు, చెరువుల పరిరక్షణ సమితి నాయకులు వంగల దాలినాయుడు, తదితరులు పాల్గొని మద్దత్తు తెలపగా యూనియన్ కార్యదర్శి తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు, ఆవాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు ఐఐఎంఆర్ ఎల్లప్పుడూ ముందుంటుంది

ఐకమత్యంగా ఉంటే సత్ఫలితాలు సాధించవచ్చని నిరూపించిన ఎఫ్ పీ ఓ డైరెక్టర్లను సత్కరించిన ఐఐఎంఆర్ డైరెక్టర్ తార సత్యవతి

విశాలాంధ్ర-చింతపల్లి : ఎఫ్‌పిఓల ద్వారా గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు ఐఐఎంఆర్ ఎల్లప్పుడు ముందుంటుందని, ఐకమత్యంగా ఉంటే అనుకున్నవి సాధించవచ్చునని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి తార సత్యవతి అన్నారు. ఐఐఎంఆర్, నాబార్డ్, బీసీటీ కెవికె ల సహకారం, ప్రోత్సాహంతో గడచిన మూడేళ్లలో లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అకౌంటెంట్ రాజేష్ ఆధ్వర్యంలో నిర్మించిన లంబసింగి ఎఫ్ పి ఓ కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, అవుట్ లెట్స్, ఆర్వో వాటర్ ప్లాంట్ లను ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ కే శ్రీనివాస బాబు, డాక్టర్ సంగప్ప, ఏపీ ఎఫ్ పి ఎస్ సీఈవో డాక్టర్ గెద్దం శేఖర్ రావు బాబు, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్, నాబార్డ్ డిడిఎం చక్రధర్, బీసీటీ కెవికె శాస్త్రవేత్త డాక్టర్ల కుర్రా శైలజ, స్థానిక ఆర్ఏఆర్ఎస్ఏడిఆర్ అప్పలస్వామిలతో కలిసి ఆమె లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్ పి ఓ తయారుచేసిన పలు ఉత్పత్తులను ఆమె పరిశీలించారు. అనంతరం డాక్టర్ రఫీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ ప్రాంతంలో కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, వాటర్ ప్లాంట్, అవుట్లెట్స్ ఏర్పాటుకు అహర్నిశలు శ్రమించిన ఎఫ్‌పిఓ చైర్మన్ ఉల్లి నూకరాజు, డైరెక్టర్లు సరోజ (రూతు), ఇందిర, శోభారాణి, కన్నబాబు లతో పాటు ఎఫ్ పి ఓ అభివృద్ధికి ప్రోత్సహించిన పలువురిని ఈ సందర్భంగా ఆమె అభినందించి దుస్సాలువాల తో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమిష్టి కృషితో ఏపనినైనా సాధించవచ్చునని, సహకరిస్తున్న, ప్రోత్సహిస్తున్న వివిధ శాఖల ఉన్నత అధికారులతో పాటు స్థానికంగా ఉన్న ఎఫ్ పి ఓ సభ్యులంతా సమిష్టిగా కృషి చేస్తే ఏ రంగంలోనైనా, ఎన్ని బృందాలుగా ఉన్నా అనుకున్న లక్ష్యాన్ని అందుకోవచ్చన్నారు. ఐఐఎంఆర్, నాబార్డ్‌లు గిరిజన రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా ముందుంటాయని, వాటి సహకారంతో బీసీటీ కేవీకే, హెచ్ఎంఆర్ ప్రోత్సాహంతో స్థానిక రైతాంగం ఈ ప్రాంతంలో సేంద్రీయంగా ఉత్పత్తి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులతో తయారుచేసే వివిధరకాల ఉత్పత్తులద్వారా ఆర్థిక స్థితిని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. అదేవిధంగా మిగిలిన పంచాయతీలు, గ్రామాల్లోనూ రైతులకు అవగాహన కల్పించి ఎఫ్ పి ఓ బృందాలుగా తయారు చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యాన్ని పొందడమే గాక ఆర్థికంగాను నిలదొక్కుకునే అవకాశాలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో గడచిన ఏడాది 200 ఎకరాలలో రాగులు, సామలు సాగు చేసిన రైతాంగం ఈ ఏడాది ఎనిమిది వందల ఎకరాలలో సాగు చేయడం శుభ సూచకమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఎఫ్ పి ఓ అనతి కాలంలోనే ఇంత అభివృద్ధి చెందేందుకు కృషిచేసిన రాజేష్ ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. స్థానిక సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ పొట్టిక లోవరాజులు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజన రైతాంగానికి ఉపయోగపడే వ్యవసాయ ఉత్పత్తుల కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, ఆర్వో వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమన్నారు, అనంతరం శాస్త్రవేత్తలు శ్రీనివాస్ బాబు, రమేష్ కుమార్, సంగప్ప, నాబార్డ్ డీడీఎం చక్రధర్, ఆర్ ఎ ఆర్ ఎస్ ఏడిఆర్ అప్పలస్వామి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త బాల హుస్సేన్ రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త చెట్టి బిందు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ, అంకంరెడ్డి చంద్రిక, హెచ్ఎంఆర్ బృందం సభ్యులు, ఎఫ్ పి ఓ సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్లు తమ డిమాండ్లు నెరవేర్చాలని ర్యాలీ

విశాలాంధ్ర-చింతూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థ గురించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు వాలంటీర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, 10వేల వేతనహామీ నెరవేర్చాలని, జాబ్ చార్జ్ ప్రకటించాలని బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లకు రాజకీయరంగు పూయకండని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ ఆదేశాలు మేరకే తాము విధులు నిర్వహిస్తామని తమ విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించండి అంటూ వాలంటీర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని వేడుకున్నారు. చింతూరు డివిజన్ కేంద్రం నుండి ఐటిడిఎ వరకు నినాదలు చేసుకుంటూ ర్యాలీ గా వెళ్లిన వాలంటీర్లు చింతూరు ఐటిడిఎ వద్ద తమ డిమాండ్‌లు నెరవేర్చాలని ఆందోళన చేశారు. అనంతరం చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతి ప్రతం సమర్పించారు.

హౌస్ హెూల్డ్ జియో లొకేషన్ సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-సీతంపేట : ఎస్ ఆర్ శంకరన్ ఐటిడిఏ మీటింగ్ హాల్లో గ్రామ వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి బి. రామ్ గోపాల్ మండలంలోని సచివాలయ ఉద్యోగులందరికీ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈ క్రింది అంశాలపై చెప్పడం జరిగింది. ఎన్ పి సి ఐ బ్యాంకు ఖాతాలు లేనివారికి మరియు ఆధార్ బ్యాంక్ అకౌంట్ కి లింక్ అవ్వని వారికి తప్పనిసరిగా నవంబర్ 30 నాటికి బ్యాంకు ఖాతాను ఆధార్ నంబర్కు లింక్ చేయవలనని ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ సచివాలయం ఉద్యోగులు త్వరితగతిన ఈ పనిని పూర్తి చేయాలని చెప్పడం జరిగింది.పోస్టల్ డిపార్ట్మెంట్ తరఫునుంచి బ్యాంకు ఖాతాలు 200 రూపాయలకే తెరిచే అవకాశం ఉన్నందున ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని ప్రజలు సచివాలయం సిబ్బంది సహకారంతో ఈ పనిని పూర్తి చేయవచ్చును.హౌస్ హెూల్డ్ జియో లోకేషన్ సర్వే మరియు స్కూల్ ఇన్స్పెక్షన్స్ పురోగతి సాధించాలని సచివాలయం సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా సచివాలయం ఉద్యోగుల హాజరు తప్పనిసరిగా ఉండాలని, ఏపీ సేవా సర్వీసు డబ్బులు చెల్లింపులు ప్రతిరోజు చేయవలెనని ఆదేశించడమైనది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.గీతాంజలి, పరిపాలన అధికారి ఎన్.మాస పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞానంతో కొంతమంది చౌకబారు ప్రకటనలు చేస్తున్నారు

జనసేన పార్టీ పాడేరు, అరకు పార్లమెంటు ఇంచార్జ్ డా॥వంపురు గంగులయ్య

విశాలాంధ్ర-కొయ్యూరు : జనసేన పార్టీతో సంబంధంలేని ఒకరిద్దరు రాజకీయ అజ్ఞానంతో కుళ్ళు కుతంత్రాలతో విషం నింపుకున్నటువంటి వ్యక్తులతో కలిసి పార్టీని అస్థిరపరచడానికి జరుగుతున్న కుట్రలో భాగమే కొంతమంది వ్యక్తులు చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని జనసేన పార్టీ పాడేరు అరకు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. శనివారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి కొంతమంది వ్యక్తులు కావాలని ఇలాంటి ప్రయత్నాలకు పూనుకుంటున్నారన్నారు . ఏ రాజకీయ పార్టీలోనైనా ఉద్యమంలోనైనా ఏ వ్యవస్థలోనైనా కుట్రలు కుతంత్రాలు వెన్నుపోట్లు అనేవి సహజంగా జరుగుతూనే ఉంటాయని విశ్వనీత అనేది కోల్పోయిన పరిస్థితులు నేడు గిరిజన ప్రాంతంలో ఎందరినో చూస్తూనే ఉన్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన పార్టీని చాలెంజిగా తీసుకొని గిరిజన ప్రాంతంలో సంస్థాగత నిర్మాణం చేస్తూ భవిష్యత్తు రోజుల్లో జనసేన అధిపత్యమే మన అందరి లక్ష్యంగా నేడు పార్టీ నిర్మాణానికి అందరూ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు రాజకీయ క్షేత్రంలో గిరిజన ప్రజలు ముందు నిలబడ్డం ఇటువంటి సమయంలో డీసీసీ డైరెక్టర్ పదవి తనకు కేటాయించిన కారణంగా అధిష్ఠాయికి తగ్గట్టుగా లేదని పార్టీ నిర్మాణానికి దోహతిపడేలా లేనందున గౌరవ ప్రదంగా ఉండే ఉండే పదవి ఉంటే బాగుండేదని ఒత్తిడి అనేక రకాల వ్యక్తుల దగ్గర నుండి గిరిజన ప్రజల నుండి వివిధ సంఘాల నుండి వచ్చినటువంటి ఒత్తిడి దృశ్య పార్టీకి ఎక్కడ నష్టం జరిగిన పద్ధతిలో ప్రజలు క్యాటరింగ్ యొక్క మనోభావాలను బహిర్గతం చేయడం జరిగిందన్నారు అయితే అవకాశవాదంతో స్వార్ధపలు తప్పుడు ఆలోచన విధానాలతో జనసేన పార్టీని ఇబ్బంది పెట్టాలని కుతంత్రంతో కూడిన ఆలోచన అమలు చేసే దాంట్లో భాగంగా తనపై పత్రిక ప్రకటనలు ద్వారా జరిగిన కుట్రలు కావచ్చు అని అభిప్రాయపడ్డారు అంతర్గతంగా జరుగుతున్నటువంటి కుట్రలు కావచ్చు అన్ని చూస్తూనే ఉన్నామన్నారు అయితే ఆ రకమైనటువంటి చర్చలు ఆరోగ్యపరంగా ఉండాలి కానీ కుతంత్రాలతో కూడుకున్న విధానాలు పార్టీకి కానీ వ్యక్తిగతంగానే పార్టీలో పనిచేస్తున్న అనేకమందిపై గాని మంచిది కాదని ఈ సందర్భంగా అందరికీ తెలియజేస్తున్నానన్నారు కాబట్టి ఎవరెవరు ఏంటి ఈ రకమైన ఆలోచన విధానం కనుగొన్నారు అనేటువంటి విషయాలు చాలా వరకు బహిర్గతం అయిందన్నారు. అది భవిష్యత్తు రోజుల్లో దానికి సంబంధించిన ఒక స్పష్టమైన ఆలోచన విధానంతో ముందుకెళ్లి విధంగా మనకు ఆలోచన కల్పించిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు రానున్న రోజుల్లో పార్టీ నిర్మాణానికి పార్టీలో ఎస్వినీయతకు ఏంచేయాలో ఎలా చేయాలో జనసేన పార్టీ సిద్ధాంతాలకు లోబడి అధిష్టానం చూసినట్టు ముందుకెళ్లే విధంగా కార్యచరణ చేస్తానని తెలియజేశారు కుతంత్రాలుతో కూడుకున్న చెడు ప్రచారానికి మనస్సాక్షితో మంచితనంతో ముందుకు సాగడానికి ఆలోచన చేస్తే ఏవ్యక్తికైనా సమాజంలో గౌరవం పెరుగుతుందని అన్నారు సోషల్ మీడియాలో లేదనుకుంటే స్వార్ధపరులు ఆలోచన విధానంతో జరుగుతున్న చెడు ప్రచారానికి ఎంతటితో ముగింపు పలకాలని వార్ధపూరిత వ్యక్తులు వృత్తులు నిస్వార్ధంగా నిజాయితీగా పనిచేసే జనసైనికులు నాయకులు ఆ ఉచ్చులో వెళ్ళొద్దని ఇందులో అనేకమంది మనసుకు గాయం కలిగించినప్పటికీ రాజకీయాల్లో ఫుల్లు కుతంత్రాలు స్వార్థం అనేది సహజంగానే వస్తుందని సత్యాన్ని గ్రహించాలన్నారు ఇటువంటి విషయాలను సాధారణంగా తీసుకొని ఇంతటితో ఈ చర్చిలు ముగించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

రాజు ప్రాణం కాపాడిన అంబులెన్స్ డ్రైవర్ కట్టప్పకు సన్మానం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మామిడిరాజు కారులో ప్రయాణిస్తున్న సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి గ్రామానికి చేరుకోగానే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో. కొత్తగూడెం వి కేర్ ఆస్పత్రిలో వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషమించడంతో భద్రాచలం లోని వెంటిలేటర్ సదుపాయం కలిగిన మహిశ్రీ అంబులెన్స్ లో ఖమ్మం లోని ఆరోగ్య హాస్పిటల్ కి సుమారు రాత్రి 2 గంటల సమయంలో తీసుకెళ్ళారు. అక్కడ నైట్ డ్యూటీ లో వున్న మహిళా డాక్టర్ అంబులెన్స్ వద్దకు వచ్చి పరీక్షించి మరణించినట్లు గా ధ్రువీకరించి వెళ్ళిపొమ్మని చెప్పారు. అనంతరం డిక్లరేషన్ ధ్రువ పత్రం కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్ళే సమయం లో అంబులెన్స్ డ్రైవర్ సి పి ఆర్ చేయగా ప్రభుత్వ ఆసుపత్రి నైట్ డ్యూటీ డాక్టర్ ప్రాణం వున్నట్లు నిర్ధారించారు.అక్కడ వెంటిలేటర్స్ ఖాళీ లేనందువల్ల దగ్గర లోని స్థంభాద్రి హాస్పిటల్ కి వెళ్ళగా కార్డియాలజిస్టు డాక్టర్ హర్ష అత్యవసర చికిత్స అందించి తిరిగి 12 గంటల లోపు కళ్ళు తెరవడం 24 గంటలలోపు స్పృహలోకి వచ్చేలా చేశారు. మామిడి రాజు ప్రాణం కాపాడిన అంబులెన్స్ డ్రైవర్ కట్టప్ప స్వామిని ఆయన సతీమణి నర్సింగ్ టెక్నీషియన్ నవ్యశ్రీ ని మామిడి రాజు కుటుంబ సభ్యులు శనివారం మామిడి రాజు ఇంటివద్ద ఘనంగా సన్మానించి నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు కుటుంబ సభ్యులు బంధువులు అభిమానులు పాల్గొనివారిని అభినందించారు.

పనుల్లో నాణ్యత లోపంతో జడ్పిటిసి శ్రీనివాసరావు అసంతృప్తి

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లాలో పుణ్యక్షేత్రం సం మూబర పాలమాంబ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న రహదారి పనులు మూన్నాళ్ళ ముచ్చటగా కాకుండా వారం రోజులకే మొక్కలైన పరిస్థితి ఏర్పడిందని పనుల్లో నాణ్యత ఇదేనా అని మక్కువ మండల జడ్పిటిసి సభ్యులు మామిడి శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు శనివారం పంచాయతీరాజ్ డిఇ చిన్నం నాయుడుతో కలిసి సంబరలో పోలమాంబ అమ్మవారి వనం గుడి చదురు గుడి ల వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు సుమారు రెండు కోట్ల 40 లక్షల నిధులు వెచ్చించి అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించినప్పటికీ రహదారి పనులలో నాణ్యత పాటించకపోవడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన రహదారి పనులు వారం రోజులకే మొక్కలు అవడం ఏమిటని కనీసం రహదారి పనులపై చెంబుడు నీలైన జల్లె పరిస్థితి లేదని డి ఈ ని జడ్పిటిసి నిలదీశారు. అధికారుల పర్యవేక్షణ ఉందా లేదా అన్నది మీ దృష్టికి ఈ సందర్భంగా తీసుకురావడం జరిగిందని అన్నారు. దీనిపై డిఇ మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ రహదారిపై వెళ్లడం వలన గోతులు ఏర్పడ్డాయి అన్నారు వాటిని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు రహదారి పనులలో నాణ్యత లోపించకుండా చర్యలు చేపడతామన్నారు. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రహదారుల నిర్మిస్తారా అని ఆయన ప్రశ్నించారు. దీనివలన లక్షణాల వెచ్చించి వేసిన రహదారితో ఏమాత్రం ప్రయోజనం ఉంటుందని ఆయన ప్రశ్నించారు కనీసం అధికారులకైన విద్యుత్ స్తంభాలను పక్కకు ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరమని అన్నారు వెంటనే విద్యుత్ స్తంభాలను రహదారి పక్కకు మార్చాలని సూచించారు. సదురు గుడి సమీపంలో ఉన్న ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి అనుకొని భూమికి నది వైపు మెట్లు మార్గం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు లేకపోతే జాతర సమయంలో భక్తులకు అసౌకర్యం కలిగే ఆస్కారం ఉందన్నారు. వనం గుడి ఎదురుగా నిర్మించిన రోడ్డులో నీరు పోవడానికి మార్గం కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారని ఆయన అన్నారు ఇలా రోడ్డు నిర్మించడం వలన నీటి నిల్వ ఏర్పడే అవకాశం ఉందని ఆయన అన్నారు వెంటనే డి ఈ స్పందించి నీరు నిల్వకు ఆస్కారం లేకుండా పైప్ లన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ బూరి రజిత్, స్థానిక ఎంపీటీసీ పోలినాయుడు ఉపసర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రవాణా చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నాటు సారా రవాణా చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.సురేష్ అన్నారు. శనివారం కొమరాడ మండలం, విక్రంపురం గ్రామంలో దాడులు నిర్వహించి 100 నాటు సారా ప్యాకెట్లుతో కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన మెల్లిక ఆదినారాయణ అనే ఆసామి ను అరెస్ట్ చేసి నాటుసారా ప్యాకెట్లను స్వాధీన పరుచుకుని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండు కు తరలించారు.అనంతరం డిప్యూటీ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, విజయనగరం వారి ఆదేశాల మేరకు పార్వతీ పురం మున్సిపాలిటీ పరిధిలో గల ఇందిరాకాలనీ లో నాటుసారా, అక్రమ మద్యం సేవించడం, కలిగివుండడం, రవాణా చేయడం వంటి వాటి వలన కలిగే అనర్ధాలు గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

రహదారు పనులను ఎంపీడీవో, డిఈ పరిశీలన

విశాలాంధ్ర-కొమరాడ : పార్వతిపురం నుండి కూనేరు వెళ్లే రహదారి గత కొద్ది రోజులు క్రితం నుండి రహదారి మరమ్మతుల పనులు ప్రారంభమయ్యే విషయం తెలిసినదే. శనివారం మండల పరిషత్ అధికార ఎం మల్లికార్జునరావు రోడ్లు భవనాల శాఖ డిఈ అప్పాజీ కలిసి గుమ్మడ గ్రామం వద్ద రోడ్డు పనులు పరిశీలించారు ఈ సందర్భంగా సంబంధించి అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా ఎక్కడ గుంతలు లేని రోడ్లు ఉండాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల ప్రకారం రహదారి పనులు చేపట్టడం జరుగుతుందని సంక్రాంతి లోపు జిల్లాలో ఎక్కడ రహదారులు గుంతలు లేకుండా రహదారిపనులు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాలు శాఖ ఏఈ రాజేందర్ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంను శుక్రవారంనాడు పనుకుపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సైరాజేష్ మాట్లాడుతూ వాహనములను నడిపేవారు పరిమితికి మించి ప్రయాణం చేయరాదని, నిర్ణీత వేగముతో ప్రయాణముచేసి రోడ్డు ప్రమాదములను నివారించాలన్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అక్కడ ఉన్న ప్రజలకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు .ప్రతిఒక్కరూ మద్యం తాగి వాహనమును నడవరాదని, రోడ్డు నియమ నిబంధనలు, సూచనలు పాటించి ప్రమాదముల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా ఉంచాలి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్

విశాలాంధ్ర-చింతపల్లి : పాడేరు ఐటీడీఏ పరిధిలో పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తున్న సుందర ప్రదేశాలను, జలపాతాలను పరిశుభ్రంగా సమర్థవంతంగా నిర్వహించడానికి, స్థానిక సంస్థల ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం డివిజనల్ పంచాయతీ అధికారి పి ఎస్ కుమార్ తదితరులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, పాడేరు, చింతపల్లి మండలాల పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. టూరిజం సీజన్ ముగిసే వరకు అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వారంతాలలో రద్దీ దృష్ట్యా పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని షిఫ్ట్ విధానంలో ఏర్పాటు చేయాలని, పర్యాటక ప్రదేశాలలో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని యం.పి.డి.ఓ లను, పంచాయతీరాజ్ విస్తరణాధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలలో దశల వారీగా ప్లాస్టిక్ నియంత్రణ అమలుచేయడానికి వందన వికాస్ కేంద్రాలు ద్వారా రూపొందిస్తున్న ప్రత్యామ్నాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పర్యాటకులకు సూచించారు. చిలకలగెడ్డ, వంట్లమామిడి, దౌనూరు తదితర ప్రదేశాలలో వందన వికాస కేంద్రాల ఉత్పత్తులతో స్టాల్స్ నిర్వహించాలని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు.పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా ఉంచడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి పర్యాటకులు కూడా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన, అన్ని పర్యాటక ప్రదేశాలలో డస్ట్ బిన్స్ ఏర్పాటుచేసారు. పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు.

గిరిజన విద్యాశాఖలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాల మరియు కళాశాలల్లో గతదశాబ్దకాలంగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని గిరిజన విద్యాశాఖలోకి విలీనం చేసి, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్వతీపురం గిరిజన సమగ్ర అభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమ్మె నాలుగవ రోజు పాల్గొని వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతు పలుకుతూ మాట్లాడారు. దేశవ్యాప్తంగా అవుట్సోర్సింగ్‌గా ఉపాధ్యాయులను నియమించడం ఏరాష్ట్రంలోనూ లేదని, వారికి అరకొర జీతాలు ఇస్తూ వారి చేత యిన్నాళ్లు ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకోవడం అమానుషమని వీరు పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుని వెంటనే అమలుచేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 1636 మంది ఉపాధ్యాయులను తక్షణమే గిరిజన విద్యాశాఖలోకి విలీనం చేయడం గాని లేదా కనీసం కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా నియమిస్తూ 14వ వేతన సవరణ అనుసరించి వారి పోస్టులకు రావలసిన కనీస వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉపాధ్యాయ వృత్తికి సంబంధించి అన్ని అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా బయటకు పంపి వేరే వారితో భర్తీ చేయడానికి ఆయా పోస్టులను డీఎస్సీలో చూపించడం అన్యాయమని కావున ప్రభుత్వం ఈప్రతిపాదనను విరమించు కోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు వీరు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రులు వైద్యారోగ్యశాఖ నిబంధనలను పాటించాలి

విశాలాంధ్ర-బెలగాం : ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో భాగంగా పార్వతీపురంలో అభయ క్లినిక్ & డయాగ్నోస్టిక్స్, వందన హాస్పిటల్‌లను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య బృందంతో కలసి శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు అమలు చేస్తున్నారో అని ప్రతీ విభాగాన్ని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, వైద్య పరికరాల పనితీరు, ఆసుపత్రుల ఆవరణ పరిశుభ్రత, రోగుల చికిత్స నిమిత్తం అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన మొదలగు అంశాలన్నిటిపై తనిఖీ చేశారు. రిసెప్షన్ వద్ద రోగుల వివరాలు స్పష్టంగా పూర్తిగా నమోదు చేయాలన్నారు. వివిధ పరీక్షలు, తనిఖీల రుసుం (ఫీజు) వివరాలు తప్పనిసరిగా ఆసుపత్రిలో ప్రదర్శించాలన్నారు. బయోమెడికల్ వ్యర్థ పదార్థాల నిర్వహణ ఏవిధంగా అమలు చేస్తున్నారో ఆరా తీశారు. నిర్దేశించిన కలర్ కోడ్ బిన్స్‌ను వ్యర్థాలకు వినియోగించాలని, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచుతూ, నీటి సరఫరా ఉండేలా చూసుకోవా లని, చేతుల పరిశుభ్రత తప్పనిసరని ఆదేశించారు. అగ్నిమాపక రక్షణ పరికరాల నిర్వహణ, వినియోగించే నైపుణ్యంపై సిబ్బంది అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ల్యాబ్ లలో పరీక్షల నివేదికలను ఏవిధంగా అందజేస్తున్నారని అడిగి రిపోర్ట్ లను, అక్కడ పరికరాల పనితీరు, నాణ్యత పరిశీలించారు. నోటిఫైడ్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, కుక్క కాటు, పాము కాటు వివరాలు నిర్దేశించిన హెచ్ఐఎంఎస్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, సలహాలు తెలియజేసే పోస్టర్లను ఆసుపత్రిలో ప్రదర్శించాలాన్నారు. ప్రసవ గదిలో పరికరాలు, స్టెరిలైజేషన్ నిర్వహణ, రేడియంట్ వార్మర్ పనితీరు పరిశీలించారు. శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో అనస్తేషియా వైద్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వివిధ విభాగాల్లో ఉన్న సిబ్బంది నైపుణ్యత ప్రతిభను పరీక్షించారు. అనంతరం అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఆరోగ్య శాఖ కార్యాలయం డెమో వై.యోగీశ్వరరెడ్డి, డిఎస్ఓ శంకర్ తదితరులు ఉన్నారు.

బూధరాళ్లలో నిలిచిపోయిన రహదారులకు అనుమతులు ఇప్పించండి

- మీకోసంలో కలెక్టర్‌కు వినతి

-బూధరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, సంజీవ్

విశాలాంధ్ర-కొయ్యూరు : అటవీశాఖ అధికారులు కారణంగా బూధ రాళ్ల పంచాయతీలో నిలిచిపోయిన 11 రోడ్లకు అనుమతులు మంజూరు చేయాలని మీకోసం సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతి పత్రం అందివ్వడం జరిగిందని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ వార్డు మెంబర్ సాగిన సంజీవ్ తెలిపారు. శుక్రవారం పాడేరులో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అతి మారుమూల పంచాయతీ అయినా బూదరాళ్ల పంచాయతీలో బొడ్డు మామిడి ,కొర్రపాడు, సల్దిగడ్డ, తూములోవ కొత్తపల్లి గ్రామస్తులతో కలసి అటవీశాఖ అధికారులు కారణంగా నిలిచిపోయిన రహదారులు పనులు ప్రారంభించేటట్లు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించమన్నారు అలాగే పిట్టలపాడు, కునుకూరు గ్రామాల సమీపంలో ఉన్న వంతెనలకు నిధులు మంజూరు చేయాలని బాలరేవుల గరిమండ గ్రామంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌కు పక్క భవనాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఎనిమిది వేల జనాభా కలిగిన బూధ రాళ్ల పంచాయతీ ప్రజలకు 20 పడకల ఆసుపత్రిని బాలరేవుల కేంద్రంగా ఏర్పాటు చేయాలని అన్నారు. కలెక్టర్కు విన్నవించిన సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందించారని ముత్యాలమ్మ సంజీవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో రమేషు శివ రామారావు అప్పారావు రాజు చిట్టిబాబు సురేషు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ భాషపై శిక్షణ ఉపాధి కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లాలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు.క్యూరా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో పనిచేయాలనుకునే నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణలో పాల్గొనే విద్యార్థులు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి, 35 ఏళ్ల లోపు వయసు గలవారై ఉండాలన్నారు. కనీసం 2 ఏళ్ల బిఎస్సీ అనుభవం లేదా 3 ఏళ్ల జీఎన్ఎం అనుభవం అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఆరు మాసాల పాటు తిరుపతిలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఇందులో జర్మన్ భాషా కోర్సులు ఏ వన్ ఎ టు బి వన్ బి టు స్థాయిలలో నేర్పబడతాయని, అభ్యర్థులు జర్మనీలో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.అభ్యర్థుల ఎంపిక ప్రాథమిక అర్హత పరీక్ష ద్వారా జరుగుతుందని,ఈ పరీక్షలో ఇంగ్లీష్, డిజిటల్ స్కిల్స్, జ్ఞాన పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. వీసా పొందిన తర్వాత అభ్యర్థులు రూ.75 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ఇది తిరిగి చెల్లించబడుతుందని వివరించారు. అభ్యర్థులు రెసిడెన్షియల్ లేదా డే స్కాలర్స్ విధానంలో శిక్షణ పొందవచ్చుని, ఈ శిక్షణలో ఆహారం, వసతి ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. వీసా పొందిన తర్వాత అభ్యర్థులు జర్మనీలో నెలకి రూ. 2,33,000 నుంచి రూ. 3,26,000 వరకు జీతం పొందే అవకాశం ఉంటుందని, ఈనెల 14వ తేదీన క్లాసులు ప్రారంభమవుతాయని అన్నారు. 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన చెప్పారు. అభ్యర్థులు తమ బయోడేటా, అవసరమైన సర్టిఫికెట్లు పంపించాలని, మరిన్ని వివరాలకు 96769 65949 నంబరును సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల స్పందనపై తురక నాయుడువలస గ్రామస్తుల హర్షం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : తమ గ్రామ సమస్యల విషయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్పందించిన తీరుపై తురకనాయుడు వలస పంచాయతీ సర్పంచ్ పి. నాగమణి ఆధ్వర్యంలో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి లింకు రోడ్ల విషయం సర్పంచ్ పోతుల నాగమణి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు లేఖ వ్రాయగా దీనికి ఎమ్మెల్యే జగదీశ్వరి కూడా మద్దతు తెలిపి స్వయంగా ఉప ముఖ్యమంత్రికి లేఖ పంపించారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి నేరుగా పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ విఆర్ కృష్ణతేజ మైలవరపు ద్వారా జిల్లా కలెక్టర్‌కు మంజూరు చేయమని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనితో గ్రామానికి కావలసిన బిటి రోడ్లు మంజూరు కావడంతో పవన్ కళ్యాణ్ కు జగదీశ్వరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా మంజూరైన రోడ్లు విషయానికి వస్తే తురక నాయుడు వలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఖడ్గవలస పోవుటకు తుడుము పొలం మీదుగా, తురకనాయుడు వలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఇటిక గ్రామం వయా ఇసుక పొలం మీదుగా తురకనాయుడు వలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి లఖాణాపురం గ్రామం పోవుటకు వరకట్టు పొలం మీదుగా, తురకనాయుడు వలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి రావివలస గ్రామం పోవుటకు నాగావళి కాలువ గట్టు మీదుగా రోడ్డు మంజూరైనందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి వైసిపి వితరణ

విశాలాంధ్ర-కూనవరం : ఇటీవల చూచిరేవుల గూడెం గ్రామానికి చెందిన తెల్లం ముత్తయ్య ఇల్లు షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమైంది సర్వం కోల్పోయి నిరాశరులై కట్టుబట్టలతో బయటకు వచ్చిన కుటుంబానికి వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో వితరణ అందజేశారు 13,500 నగదు బియ్యం పప్పు నిత్యసర వస్తువులు బట్టలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెల్లం ముత్తయ్య కుటుంబానికి వైసీపీ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ అనంతబాబు 10 వేల రూపాయలు వైసిపి కూనవరం మండల పార్టీ ఆధ్వర్యంలో అందజేశారు స్థానిక నాయకులు అరవ వెంకట రామారావు 2000 రూపాయలు దీకొండ గంగాధర్ 500 రూపాయలు పునుగుపాటి భరతమూర్తి 500 నందికొండ నరసింహారావు 500 కొమ్మని వీర్రాజు సునీత బియ్యం పప్పు బట్టలు అందజేశారు ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు ఆవుల మరియ దాసు ఎంపీపీ పాయం రంగమ్మ జడ్పిటిసి గుజ్జ విజయ గుజ్జ బాబు స్థానిక సర్పంచ్ తెల్లం నిరోషా కొమ్మని మోహన్ రావు ఎలిపే రమేష్ బత్తుల వెంకటేష్ నోముల సత్యనారాయణ సత్తిపండు చిలకం లక్ష్మణరావు మస్కూరి వెంకటాద్రి ఆవుల మల్లికార్జునరావు నవీన్ కట్టిపోయిన వెంకన్న మంద వెంకన్న మంద నరసింహారావు గాజుల రమేష్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను సబ్ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని పెదభోగిల, సీతానగరంలలో పోలింగ్ కేంద్రాలు 140, 141, 142, 143 లను పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సందర్శించి ఓట్ల నమోదుపై ఆరా తీశారు. పోలింగు కేంద్రాల్లో ఓట్ల చేర్పులు, మార్పులు గూర్చి వివరించారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ ఉమామహేశ్వరరావు నాయుడు బిఎల్వోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటమే పిడిఎఫ్ ధ్యేయం

విశాలాంధ్ర-సీతానగరం : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటమే పిడిఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అన్నారు. శనివారం నాడు మండలంలో జోగంపేటకేజీబీవీ, గురుకుల పాఠశాలలను సందర్శించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేస్తున్న తనకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని విద్యారంగ పరిరక్షణకు నిస్వార్థ పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుపల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కునుకు మురళి మరియు యుటిఎఫ్ నాయకులు పల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్సై

విశాలాంధ్ర-కొమరాడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో కే నీలకంఠం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల ప్రకారం గంజాయి మద్యం మత్తు పదార్థాలు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటూ యువత మంచి చదువు చదువుకోవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని భావితరాలు యువతదని అన్నారు అలాగే వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలంటూ ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన పత్రాలు వాహనంలో ఉంచుకోవాలంటే 18 సంవత్సరాల లోపు ఎవరైనా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పు అని ఆయన అన్నారు.

సవర భాష పాఠ్యాంశాల పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల స్థానిక ఎటిడబ్ల్యూఓ కార్యాలయంలో శనివారం సవర భాష పాఠ్యాంశాల పుస్తకాలను ఒకటవ తరగతి విద్యార్థులకు ఎటిడబ్ల్యూఓ సురేష్ కుమార్, ఎంఈఓ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఎంటిబి, ఎంఎల్ఇ సవర భాష పుస్తకాలను పిపి1, పిపి2, పిపి 3 మొత్తం 21 పుస్తకాలను సవర భాష వాలంటీర్లకి అందించారు. ఉత్తమ బోధన అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అగ్ని బాధితులకు ఎంఎల్‌ఏ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం యార్లగడ్డ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు కాలిపోయిన ఘటనలో బాధిత కుటుంబం అల్లం కుల మల్లయ్య, కాంతం దంపతులకు రంపచోడవరం ఎంఎల్ఏ మిరియాల శిరీష, విజయభాస్కర్ లు రూ.10 వేలు ఆర్థిక సహాయన్ని అందించారని మండల తెలుగుదేశం అధ్యక్షులు పల్లాల వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆ మొత్తాన్ని కూటమి సభ్యులు కి పంపిణీ చేశారు. అలాగే మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్ 50 కేజీల రైస్ బ్యాగ్, సర్పంచ్ పల్లా ల పద్మావతి బట్టలు, కూరగాయలు, గుద్దాటి సుబ్రహ్మణ్యం బట్టలు, రెడ్డి సత్యనారాయణ రూ.1000 బాధిత కుటుంబంకు అందచేశారు. కార్యక్రమంలో విశ్వరెడ్డి,అల్లూరి సత్యనారాయణ, తాతబ్బాయి, మటం శేఖర్, పుష్పరాజు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

మహిళ సేఫ్టీ యాప్ మీద అవగాహన

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల పలు గ్రామాలలో పాచిపెంట ఎస్ఐ వెంకట కిషోర్ ఆధ్వర్యంలో మహిళా సేఫ్టీ యాప్ మీద శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మండలంలో గల అమ్మ వలస పి కొనవలస గ్రామాలలో పంట పొలం పనులలో ఉన్న మహిళలకు మహిళా సాఫ్ట్ యాప్ మీద వారు పని చేస్తున్న వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు . మహిళలు అప్రమత్తంగా ఉండాలని అందుకే ఈ మహిళ సేఫ్టీ యాప్ను ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిందని ఎస్సై వెంకట్ కిషోర్ మహిళలకు తెలిపారు అనంతరం వారి వారి సెల్ఫోన్లో మహిళ సేఫ్టీ యాప్ ను వారి వారి సెల్ఫోన్లో డౌన్లోడ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాలలో ఈ యాప్ ద్వారా సమాచారం అందించిన గంటలోనే ఏప్రాంతం నుండి ఫోన్ కాల్ వచ్చిందో తెలుసుకుని పోలీసులు ప్రత్యక్షమై మీ అవసరతలను తీరుస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ మహిళ సేఫ్టీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి మారుమూల గిరిజన గ్రామమైన అమ్మ వలస పికోనవలస గ్రామాల నుండి మహిళల నుండి అనూహ్య స్పందన లభించినట్లు ఎస్సై తెలిపారు.

రసభాసగా భూసర్వే విచారణ

రికార్డులు లేనివారిపై కొమ్ముకాస్తున్న డిప్యూటీ తహసిల్దార్

విశాలాంధ్ర-పాడేరు రూరల్ : అల్లూరి జిల్లా మండలవంట్లమామిడి సచివాలయంపరిధిలో గత కొంతకాలంగా సర్వే నెంబర్ 4 సర్వే నెంబర్ 5పై జరుగుతున్నా గొడవలను పరిష్కరించడానికి డిప్యూటీ తహసిల్దార్ అధ్యక్షతన భూసర్వే విచారణ నిర్వహించడం జరిగింది. ఇందులో సర్వే నెంబర్ 5లో ఉన్న అసామి భూ పత్రాలను డిప్యూటీ తహసిల్దార్‌కి సమారిపించిగా అది నిజమని తేలింది. కాని సర్వే నెంబర్ 4లో ఉన్న వ్యక్తులు సమర్పించిన భూ పత్రాలను పరిశీలించగా అది రిజిస్ట్రేషన్ కాలేదని అందులో పేర్కొనబడిన తేదీకి రెండు సంవత్సరాల ముందే ఆ వ్యక్తి అదృశ్యమైనట్లుగా జిమాడుగుల పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు అయిందని అప్పటినుండి ఇప్పటివరకు ఆ వ్యక్తి కనిపించకపోయినా అతని పేరుతో పేక్ డాక్యుమెంట్స్‌లను సృష్టించి ఆ భూమిని కాజ్ చేయాలని చూసినట్లు వెల్లడయింది దానితోపాటు పక్కనే ఉన్న సర్వే నెంబర్5లో భూమి ఆక్రమించి వారి పంటలను ధ్వంసం చేశారని మాకు న్యాయం చేయాలని సర్వే నెంబర్ 5లో సాగులో ఉన్న బాధితుల డిప్యూటీ తహసిల్దార్‌కి కోరారు. కాని డిప్యూటీ తాసిల్దార్ పత్రాలు లేనివారికి కొమ్ముఖస్తూ భూ విచారణ జరపాడంతో విచారణ రసభసగా జరిగింది.

లబ్దిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండలంలోగల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న పీఎం జన్ మన్ పథకం గృహా లబ్దిదారులందరూ ఇల్లు నిర్మాణాలు వేగవంతం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా డిఈఈ వి.రాజుబాబు గృహ లబ్దిదారులను సూచించారు. శనివారం మండలంలో గల జర్జుల పంచాయితీ సింధిపుట్టు గ్రామంలో పివిటిజి గిరిజనులకు పీఎం జన్ మన్ ఇల్లు గ్రౌండింగ్ మేళాలో భాగంగా హౌసింగ్ ఎఈ సిహెచ్ క్రిష్ణరావుతో కలిసి ఆయన పాల్గొని ఇల్లు గ్రాండింగ్ మేళాను ప్రారంభించారు. పీఎం జన్మన్ పథకంపై లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఈఈ వి.రాజుబాబు మాట్లాడుతూ మండలంలో పీఎం జన్మన్ గృహాల లబ్దిదారులు ఇల్లు నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా వేగవంతంగా ఇల్లులు నిర్మించుకోవాలని, అప్పుడే బిల్లులు సైతం సకాలంలో పడతాయని అన్నారు. ఎంత త్వరగా ఇల్లును నిర్మిస్తే అంతే వేగంగా బిల్లులు సైతం అందుతాయన్నారు. ఇప్పటికే కొంతమంది లబ్దిదారులకు బిల్లులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని అన్నారు. ఇకపై ఇళ్ల నిర్మాణం. వేగవంతం చేయాలని, లేకపోతే ఇలుల్లు రద్దవుతాయని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

వెంకటబైరిపురంను సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని వెంకట బైరిపురం శనివారం సబ్ కలెక్టర్ అసుతోష్ శ్రీ వాస్తవ ఆకస్మికంగా తనిఖీ నిర్ణయించారు వెంకట భైరిపురం పోలింగ్ కేంద్రం నె. 227, 228 లను సబ్ కలెక్టర్ సందర్శించారు. క్లైముల విషయంలో బి.ఎల్.ఓ లను అడిగి తెలుసుకుని వారి రిజిష్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తిపరిచారు వెంకట బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిశీలించారు. అనంతరం 10 వ తరగతి విద్యార్థి, విద్యార్థినులతో చర్చించి, ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులను అడిగే ప్రశ్నలకు సంతృప్తి వ్యక్తము చేసినారు. ఈ కార్యక్రమంలో మక్కువ తాసిల్దార్ షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు. అదేవిధంగా జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఇంటి సామాగ్రి వితరణ

విశాలాంధ్ర-కూనవరం : చూచిరేవులగూడెం గ్రామానికి చెందిన తెల్లం ముత్తయ్య పూరిల్లు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలి బూడిదైన విషయం విదితమే.సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబానికి ఇప్పటికే టిడిపి పార్టీకి చెందిన కూనవరం మండలనాయకులు 11 వేల రూపాయలు, స్థానిక ఎమ్మెల్యే పదివేల రూపాయలు అందించిన విషయం తెలిసిందే.కాగా తెలుగుదేశం పార్టీనేత ప్రముఖ ఆయుర్వేదవైద్యులు ఏజెన్సీ ఆపద్బాంధవుడుగా పేరుగాంచిన డాక్టర్ జమాల్ ఖాన్ జెకె చారిటబుల్ ట్రస్ట్ తరపున సుమారు 30 వేలరూపాయలు విలువచేసే ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు ఐరన్ పైపులు తదితరాలన్నీ వితరణగా అందించి దాతృత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మండల ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు,మాజీ మండల అధ్యక్షులు గడేసుల ప్రేమ్చంద్ ముప్పెనబోయిన నాగరాజు, బోడ వెంకటేశ్వర్లు, కారం సర్వేశ్వరరావు ట్రస్ట్ సభ్యులు సూఫీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

కాంట్రాక్టర్లకు కాసుల వరం... పునరావాస కాలనీలు

బ్లూ ప్రింటునే మార్చేస్తున్న వైనం

విశాలాంధ్ర-దేవీపట్నం : పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం నిర్మిస్తున్న నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల నిర్వాహకం తేట తెల్లమవ్వటం పై మండల జనసేన పార్టీ అధ్యక్షులు శారపు వెంకట రాయుడు క్షేత్ర స్థాయి పరిశీలనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో గానుగుల గొంది గ్రామానికి నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు బయట పడటం బేస్మెంట్ లేకుండా నిర్మాణాలు చేపట్టడం అనతికాలంలోనే గోడలు బీటలు వాళుతున్న పరిస్థితులను పరిశీలించిన రాయుడు కాంట్రాక్టర్ నిర్లక్ష్య సమాధానం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాల్లో అడ్డంగా ఉన్న బండ రాళ్ళను సైతం తొలగించటం లేదని భాధిత నిర్వాసితులు చెప్పడం పై కాంట్రాక్టర్ ఇష్టా రాజ్యంగా వ్యవహరించటం పై ఆదినాయకులు చంద్రబాబు నాయుడు మరియు జనసేన నేత పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండల సీనియర్ నాయకులు కొమరం దొరబాబు శారపు ఉదయ్ కుమార్ కోండ్ల సురేష్ రెడ్డి ఐనేలు భద్రం కె రవి కుమార్ జనసేన మండల మీడియా కో ఆర్డినేటర్ కారం దుర్గా ప్రసాద్ దొర తదితరులు పాల్గొన్నారు.

ఈ.కొడిచింగిలో హౌసింగ్ గ్రౌండ్ మేలా

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని వంచుల పంచాయితీగల ఈ.కొడిచింగీ గ్రామంలో పీఎం జన్మన్ హౌసింగ్ పథకం ద్వారా మంజూరైన గృహాలను ఈకోచింగ్ గ్రామంలో మండల హౌసింగ్ ఏఈ సెగ్గే సూరిబాబు పరిశీలిస్తూ గ్రౌండ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఈ గ్రామానికి మొదటి విడతగా 125 ఇండ్లు మంజూరు చేయడమైందని, ఈ మంజూరైన గృహాలకు బేస్మెంట్ లెవెల్ లోకి ఇదివరకు బిల్లులు పెట్టడం జరిగిందన్నారు. మిగిలినటువంటి ఇండ్లకు కూడా బిల్లులు పెట్టడం జరుగుతుందని, ఈ చక్కటి అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అర్హత ఉన్నటువంటి కుటుంబాలకు ఆన్లైన్ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ పాడల్, పంచాయితీ కూటమి సభ్యులు ముర్ల కోటేశ్వరరావు టిడిపిమండల యువత అధ్యక్షులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోత్తూరు కొండలరావు, బిజెపి మండల ఉపాధ్యక్షులు చేదల అబ్రహం, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశాపేటలో గోకులాన్ని ఎంపీడీవో తనిఖీ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని కాసాపేట గ్రామంలో రైతు సత్యంనాయుడు నిర్మిస్తున్న గోశాలను ఎంపిడిఓ పాంద్రంకి త్రివిక్రమ రావు శనివారం సందర్శించారు. సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా గ్రామంలోని నిర్మిస్తున్న ఇళ్లను పరిశీ లించారు. సచివాలయాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఇళ్ల సర్వేను పూర్తి చేయాలన్నారు.